# చిత్రమే మరి!

## జి. ఉషా విశాల్




"మిమ్మల్ని కాషియర్ పిలుస్తున్నాడు, మస్టారూ!" అంటూ రామారావు నోట్లు లెఖ్ఖపెట్టుకుంటూ సెక్షన్‌లోకి వచ్చి చెప్పగానే, మూర్తిగారు ఆనందంగా *సీట్లోనించి లేస్తూ-

"కాజువల్ లీవు సరెండర్ చేశాను. ఆ కేష్ వచ్చి ఉంటుంది" అన్నారు. ఆయన సెక్షన్‌లో నించి గబగబ వెళ్ళబోతూ ఉంటే రామారావు కొస్త కంగారుగా, "మూర్తిగారూ!" అంటూ పిలిచిన పిలుపు ఆయన చెవిన పడలేదు.

ఎక్విటెన్స్‌లో సంతకం పెట్టి, డబ్బు తీసుకుని లెఖ్ఖ పెట్టుకుంటూ కాష్ కౌంటర్‌కి కొస్త దూరంలో నిల్చున్న మూర్తిగారు, "సార్!" అన్న పిలుపు విని తలెత్తి చూశారు.

నూనె మరకలుతో అసహ్యంగా ఉన్న ఖాకీ బట్టల్లో ఒకతను చేతులు నులుముకుంటూ నిల్చుని ఉన్నాడు. రేగిపోయిన జుట్టు చేత్తో సర్దుకుంటూ, "నేను వర్క్‌షాపులో పనిచేస్తూ






ఉంటాను, సార్! మాఆవిడకి చాలా జబ్బుగా ఉంటే ఆస్పత్రిలో చేర్పించాను, సార్! డాక్టరేమో ఆపరేషన్ చెయ్యాలీ, ఎడ్వాన్సు రెండొందలు కట్టమని చెప్పారు. నెలాఖరు. ఎక్కడ్నించి తేగలను? నలుగురు పిల్లల తల్లి, సార్!" అంటున్న అతని కళ్ళల్లో నీళ్ళొక్కటి తక్కువగా ఉన్నాయి. వాడిపోయిన అతని మొహం అతి దీనంగా ఉంది.

అతని మాటలు వినగానే మూర్తిగారి జాలి గుండె కరిగిపోయింది. ఆయన అతన్ని జాలిగా చూస్తూ, "అరెరే! మెడికల్ ఎడ్వాన్స్ ఇస్తారు గదటోయ్! అప్లయి చెయ్యలేక పోయావా?" అన్నారు.

"చేశాను, సార్! శాంక్షన్ అవాలి, బిల్లు పాసవాలి. మీకు తెలియని తతంగమేముంది, సార్? కనీసం రెండు రోజులైనా పడుతుంది డబ్బు చేతిలో పడటానికి. రెండొందలు సర్దండి, సార్! మెడికల్ ఎడ్వాన్స్ రాగానే మీ డబ్బు మీకు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తాను. అతను ఇంచుమించు మూర్తిగారి కాళ్ళు పట్టుకున్నంత పని చేశాడు.

మూర్తిగారు ఇబ్బందిగా అతని వైపు చూశారు. అంత పెద్ద ఫాక్టరీలో అతనెవరో తెలీదు. ముక్కూ మొహం తెలియని వాడి చేతిలో తన కష్టార్జితం, అందులోనూ డబ్బు కంటే విలువైన కాజువల్ లీవ్ సరెండర్ చేసి తీసుకున్న డబ్బును పెట్టడానికి మనసు ఒప్పడంలేదు. కాని, అవతలి మనిషి అవసరం సామాన్య మైనది కాదు. రేపు ఆపరేషన్ జరగక ఆ నలుగురు పిల్లల తల్లీ పోతే-'ఛీ!వెధవ డబ్బు ఇవ్వడానికి వెనక ముందు లాడి నిండు ప్రాణం పోవటానికి కారణ మయాను కదా!' అని జీవితాంతం మధన పడాల్సి రావచ్చు. ఆలోచిస్తూ నిల్చున్నారు మూర్తిగారు. ఆయన డబ్బు తీసుకున్నది ఎదుటి వ్యక్తి అవసరంతో పోలిస్తే చాలా సామాన్యమైన విషయానికే! చాలా రోజులుగా భార్యకి వాచీ కొని ప్రెజంట్ చెయ్యాలనుకొంటున్నారు. నెల జీతంలో తను వాచీ కొనే అవకాశం లేదని అనుభవం మీద తెలుసు గనక, అతికష్టం మీద కాజువల్ లీవ్ వాడుకోకుండా గడిపి సరెండర్ చేసి ఆ డబ్బు తీసుకున్నాడు. వాచీ రెండురోజు లాగి కొనుక్కొన్నా సరిపోతుంది. అవతలి మనిషి ప్రాణం రెండు రోజులు ఆగక పోవచ్చును. ఒక నిండు ప్రాణం, ఒక కుటుంబం తన వల్ల నిలబడుతున్నప్పుడు తను వెనక ముందులు ఆలోచించ కూడదు. పాపిష్టి డబ్బుదేముంది? ఈ రోజు వస్తుంది. రేపు పోతుంది. సాటి మనిషికి సహాయపడటం మానవత్వమున్న మనిషిగా తన కర్తవ్యం! క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చి, డబ్బు అతని చేతిలో పెడుతూ-"నీ పేరేమి టన్నావ్?" అనడిగారు.

"సంజీవరావండీ! మీ మేలు మరువలేను, సార్! ఎడ్వాన్స్ అందగానే మీ డబ్బు మీకు ఇచ్చేస్తాను, సార్!" డబ్బుని హడావిడిగా ఒక పాత పర్సులో కుక్కుంటూ జవాబు చెప్పి, అక్కడ్నించి త్వరత్వరగా అతను వెళ్ళిపోయాడు.

మూర్తిగారు-'ఆ డబ్బు ఒక ప్రాణాన్ని కాపాడ గలిగితే అంతకంటే కావలసిందేమీ లేదు' అనుకుంటూ తన సెక్షన్ వైపు నడిచారు. వట్టిచేతుల్తో వచ్చి నిట్టూరుస్తూ తన సీట్లో కూర్చోబోతున్న మూర్తిగారిని రామారావు- "మాస్టారూ! డబ్బు తీసుకున్నారా?" అని అడిగాడు, కాస్త అనుమానంగా చూస్తూ.

"తీసుకున్నానోయ్! కాని..." అంటున్న ఆయన మాట పూర్తి కాకుండానే రామారావు అందుకుని,

"కౌంటర్ దగ్గర ఆ వర్క్‌షాప్ సంజీవరావు ఎదురయాడా? తన భార్యకి జబ్బుగా ఉందనీ, ఆపరేషన్‌కి అడ్వాన్స్ కట్టాలనీ అడిగేడు కదూ?" అన్నాడు.

మూర్తిగారు- 'రామారావునుకూడా అడిగినట్టున్నా డతను పాపం!' అనుకుంటూ, "అవునోయ్! అలాగే అడిగేడు" అన్నారు.

"మీరుగాని కొంపదీసి అతని చేతిలో డబ్బు పొయ్యలేదు కదా?"

రామారా వెందుకు అంత ఎక్సైయిట్ అయిపోతున్నాడో, కంగారు పడిపోతున్నాడో మూర్తిగారికి అర్థం కావడం లేదు. "అవతల మనిషి ప్రాణాపాయంలో ఉంటే ఇవ్వకుండా ఎలా ఉండటం? మెడికల్ ఎడ్వాన్స్ తీసుకుని ఇచ్చేస్తా నన్నాడు."

రామారావు తల పట్టుకుంటూ, "మాస్టారూ! మోసపోయారు. వా డుత్త యూస్‌లెస్ ఫెలో, సార్! వాడికి లేని దురలవాటు లేదు. ముఖ్యంగా రేసులకి విపరీతంగా డబ్బు తగలేస్తూ ఉంటాడు. వాడి భార్య నలుగురు పిల్లల్ని వెంటబెట్టుకుని వచ్చి మొన్న యూనియన్ లీడర్‌ని కలిసింది. మహా జిత్తులమారి మనిషి వాడు. వాడి కల్లబొల్లి కబుర్లకీ, మొసలి కన్నీళ్ళకీ కరిగిపోయి మీలాంటి వాళ్ళు చాలా మంది వాడి బుట్టలో పడుతూ ఉంటారు. నేను మీరు కాష్ తీసుకోవడానికి వెళ్ళేముందు వాడి విషయం హెచ్చరిద్దామని మిమ్మల్ని పిలిచాను. మీకు వినపడలే దనుకుంటా!"

రామారావు మాటలు విన్న మూర్తి గారి గుండెలో బల్లెం దిగిన ట్టయింది. ఇంత సేపూ తన కష్టార్జితాన్ని ఒక మంచిపనికి ఉపయోగించానని తృప్తిపడుతున్న ఆయన మనసు-అరె, మోసపోయానే అనే బాధతో విలవిల్లాడసాగింది. నల్లబడిన మొహంతో బాధగా -"అత నలాంటి వాడని తెలీ లేదోయ్!" అన్నారు.

రామారావు సానుభూతిగా ఆయన వైపు చూస్తూ, "ఎంత సేపూ మీ పనేమో, మీరేమో అన్నట్టుండే మీకు వాడి సంగతి తెలిసి ఉండదని నాకు తట్టబట్టే మిమ్మల్ని హెచ్చరిద్దా మనుకున్నాను" అన్నాడు.

మూర్తిగారికి మరి ఆ సంభాషణ పెంచడం ఇష్టంలేక పోయింది. మౌనంగా ఓ ఫైలు తెరచి చూస్తూ కూర్చున్నాడు. మూర్తిగారిది మొదట్నుంచీ కాస్త ముభావంగా ఉండే స్వభావం. చాలా నియమబద్ధమైన జీవితం గడిపే ఆయన తనలోని లోపాలను, తప్పులను సరిదిద్దుకోవాలని ప్రయత్నిస్తూ ఉండేవారే గాని, అవతలి వాడు ఎలాంటివాడూ అని ఆలోచిస్తూ ఉండేవారు కాదు. ఎంత మంచి మనిషికైనా మోసపోవడం అన్న విషయం చాలా బాధ కలిగిస్తుంది. మూర్తిగారు ఆ విషయం గురించి మళ్ళీ మాట్లాడకపోయినా, రోజంతా మానసికంగా చాలా బాధపడ్డారు.

×× ×× ××

"ఇవాళో విచిత్రం జరిగింది" అంది జయలక్ష్మి, భర్త కంచంలో మరి కాస్త కూర వేస్తూ.

పరధ్యానంగా అన్నం కెలుకుతూ కూర్చున్న మూర్తిగారు కళ్ళెత్తి నిరాసక్తంగా భార్యవైపు చూశారు.

ఉత్సాహంగా ఏదో చెప్పబోతున్న జయలక్ష్మి భర్త వాలకం కనిపెట్టి, "అదేమిటి... అలా ఉన్నారు?" అంది కాస్త గాభరాగా.

మూర్తిగారు కాస్త తేరుకుని, "అబ్బే! ఏంలేదు. ఏమిటి? ఏదో చిత్రం జరిగిందని చెప్పబోతున్నావు?" అనడిగారు.

జయలక్ష్మి మళ్ళీ ఉత్సాహంగా, "ఈ రోజు కాష్ టాలీ అవలేదు. రెండు వందలు తక్కువ వచ్చాయి. ఎవరికి పొరపాటున ఎక్కువ ఇచ్చానో తెలీలేదు. ఆ రేస్ కోర్సు మహా సముద్రంలో ఎవరికి ఇచ్చామో ఎలా తెలుస్తుంది? నాకు డబ్బు పోయిన బాధకంటే అవమానంతో కళ్ళమ్మట నీళ్ళొచ్చినంత పనైంది. కొత్తగా దొరికిన ఉద్యోగం! ఊడిపోతుందేమోననే భయం!..." స స్పెన్సు కోసం అన్నట్టు కాస్త ఆగింది జయలక్ష్మి.

భార్య మాటలు విన్న మూర్తిగారి మనసు బాధగా మూలిగింది. 'ఖర్మ! తనో రెండొందలు తెలివి తక్కువతనంగా పోగొట్టుకుంటే, భార్య మరో రెండొందలు పోగొట్టుకుందన్న మాట!' అనుకున్నారు.

జయలక్ష్మి భర్త భావాల్ని గమనించకుండా, "చీఫ్ కాషియర్-'వెహికల్ ఎరేంజ్ చేస్తాను, వెళ్ళి ఇంటినించి డబ్బు తీసుకొచ్చి కట్టేయండి' అన్నాడు. కాని, ఇంట్లోమాత్రం అంత డబ్బెక్కడిదీ? నేను బిక్కమొహం వేసుకుని ఆలోచిస్తూ నిల్చొనుండగానే హఠాత్తుగా నా కా పర్సు సంగతి జ్ఞాపకానికి వచ్చింది..."

మూర్తిగారు వినుగ్గా-"నువ్వు కథలు రాస్తావని నాకు తెలుసుకాని, ఆ పర్సేమిటో, దాని కథేమిటో నాకు ముందు చెప్పలేదు. ఈ డొంక తిరుగుడు మాటలంటే నాకు తలనొప్పి!" అన్నారు.

జయలక్ష్మి చిన్నబుచ్చుకుని, "ఈ రోజు మీ మనసెందుకో బాగున్నట్టు లేదు. నా మాటలు మీకు విసుగు కలిగిస్తున్నాయి" అంది. జయలక్ష్మికి మొదట్నుంచీ ఏ విషయాన్నయినా సాగదీసి అలంకారాలతో చెప్పటం అలవాటు. భార్య ఆ అలవాటు మూర్తిగారి కెంతో ఇష్టం. భార్య ముక్తసరిగా మాట్లాడిందంటే భార్యకి కోపం వచ్చినట్టు గ్రహిస్తారాయన. ముభావంగా ఉండే ఆయన, ఎక్కువగా మాట్లాడే జయలక్ష్మికి మంచి శ్రోత.

భార్య మనసుని బాధ పెట్టినందుకు నొచ్చుకుంటూ, "ఏదో ఆఫీసులో జరిగిన విషయం గురించి ఆలోచిస్తూ అలా అనేశాను గాని-ఆ పర్సేమిటో, దాని కథేమిటో చెప్పు!" అన్నారు.

జయలక్ష్మికి ఉత్సాహం తగ్గిపోయింది. రేస్ కోర్సు దగ్గర బస్సు దిగిన తనకి రోడ్డుమీ దొక పర్సు దొరికినట్లు,ఆ జనంలో అది ఎవరి పర్సో తెలుసుకొనే అవకాశం లేని తను ఆ పర్సు హాండ్ బాగ్‌లో వడేసుకుని, తర్వాత దాన్ని గురించి మరిచిపోయినట్టు, డబ్బు పోగొట్టుకోగానే తన కా పర్సు సంగతి జ్ఞాపకం వచ్చి దాన్ని తీసి చూస్తే దాన్లో సరిగ్గా రెండు వందల రూపాయలే ఉన్నట్టూ, ఆ డబ్బు ఎవరిదైనా గాని తనని ఎంతో అవమానం నించి కాపాడినట్టూ భర్తకి చిలవలూ పలవలుతో వర్ణించి, వర్ణించి చెప్పాలనుకున్నది జయలక్ష్మి. భర్త చిరాకుగా ఉండటంతో మౌనంగా లేచి వెళ్ళి తనకి దొరికిన పర్సు తీసుకొచ్చి భర్త చేతిలో పెడుతూ, "ఈ రోజు ఈ పర్సు దొరికి ఉండకపోతే నేను చాలా బాధ పడాల్సి వచ్చి ఉండేది. తమాషా ఏమిటంటే-దీన్లో సరిగ్గా రెండొందలే ఉన్నాయి. ఆ పర్సులో ఆ పర్సు తాలూకు మనిషి ఫొటో, ఎడ్రసు ఉన్నాయి చూశారా? ఎలాగైనా రేపో రెండొందలు తెచ్చి ఈ పర్సులో పెట్టి, ఆ అడ్రసులో ఉన్న మనిషికి అందజెయ్యాలి" అంది.

చేతిలోని పర్సుని, ఫొటోని తిప్పి తిప్పి చూస్తూ- "ఎంత విచిత్రం!" అన్నారు మూర్తిగారు ఆశ్చర్యంగా.

జయలక్ష్మి, "సరిగ్గా నేను పోగొట్టుకున్న డబ్బూ రెండు వంద లవడం, ఆ పర్సులో అంతే డబ్బు ఉండటం విచిత్రం కాక మరేమిటి?" అంది.

"అదికాదు చిత్రం! నా కష్టార్జితం ఎలాగైనా ఈవేళ రేసు కోర్సు వాళ్ళకే చెందాలని రాసిపెట్టి ఉండటం!" అంటూ, మూర్తిగారు ఆ రోజు జరిగిన సంగతి కథలా చెప్తూ ఉంటే ఆశ్చర్యంగా వింటూ నిలబడిపోయింది జయలక్ష్మి. ●


తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను సరుక్క పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోనై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించలేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN ( A )**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***



ముస్తాబులో మార్పు!




సరిక్రొత్త
ఆకర్షణీయమైన సీసాలలో
లోధ్ర
బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
80 సంవత్సరములుగా
ఇచ్చుచున్నది.
ఉచిత వైద్య సలహాకు ఈ
కూపనును పూర్తిచేసి
పంపండి.

పేరు: ..............................
విలాసము: ..............................
..............................PIN..........

ఏజంట్లు:
శీతారామ జనరల్
స్టోర్స్ ఏజన్సీస్
విజయవాడ —సికిందరాబాద్

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14